నేడు పెంచికలపేట బంద్

పెంచికలపేట, ఆగస్టు 16: బంగ్లాదేశ్‌లో హిందువులపై, ఆలయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ హిందువులకు మద్దతుగా పెంచికలపేట హిందు సంఘాలు శనివారం బంద్‌కు పిలుపునిచ్చాయి. వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు, హోటళ్లు శాంతియుతంగా బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రోడ్ల నిర్మాణాలపై విచారణ

సిర్పూర్(టి), ఆగస్టు 16: మండలంలో చేపట్టిన అభివృద్ధిపనులపై వచ్చిన ఫిర్యాదు మేరకు పంచాయతీరాజ్ ఈఈ రామ్మోహన్‌రావు, ఏఈ ఆత్మారావు విచారణ చేపట్టారు. శుక్రవారం చాకలి వాడలో సీఎంఎఫ్‌సీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డుకు కొలతలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ నివేదికలను ఉన్నతాదికారులకు పంపిస్తామన్నారు.

అందరూ కలిసి సాగు చేసుకోవాలి

● కాంగ్రెస్ నాయకుడు రావి శ్రీనివాస్


ఇటిక్యాలపహాడ్‌కి వెళ్తున్న రావి శ్రీనివాస్, అధికారులు

సిర్పూర్(టి), ఆగస్టు 16: మండలంలో ఇటిక్యాల పహాడ్ గ్రామంలో కొన్నిరోజులుగా ఉన్న పోడుభూముల వ్యవహారం కొలిక్కిరాగా శుక్రవారం గ్రామాన్ని కాంగ్రెస్ నాయకుడు రావిశ్రీనివాస్ సందర్శించి గ్రామస్థులతో మాట్లాడారు. అందరు కలిసికట్టుగా సాగు చేసుకోవాలన్నారు. సీఐరమేష్, ఎఫ్ఆర్వో ఎక్బాల్‌హుస్సేన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై దీకొండ రమేష్ మాట్లాడుతూ ఇటిక్యాల పహాడ్‌గ్రామంలో రైతులు సాగు చేసుకుంటున్న భూములను అందరు కలిసి సాగు చేసుకోవాలన్నారు. భూమి విషయంలో గ్రామ స్థులు ఘర్షణకు పాల్పడితేచర్యలు తీసుకుంటా మన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో భయం.. భయం


కాగజ్‌నగర్‌లోని లోతట్టు ప్రాంతమైన సంజీవయ్య కాలనీ

- వర్షం కురిసిందంటే తిప్పలే
- ఇళ్లలోకి వస్తున్న వరదనీరు
- రాత్రి వర్షం కురిసిందంటే జాగరణే
- పరిష్కరించాలని కాలనీవాసుల డిమాండ్

కాగజ్‌నగర్, ఆగస్టు 16: ఏటా వర్షాకాలంలో కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో లోతట్టు ప్రాంతాలైనసంజీవయ్యకాలనీ, మార్కెట్ ఏరియా, తదితర కాలనీవాసులు భయం గుప్పిట్లో కాలం వెళ్లదీస్తున్నారు. అరగంట పాటు భారీ వర్షం కురిసిదంటే చాలు వీరి అవస్థలు వర్ణాణాతీతం. కాగజ్‌నగర్ మున్సిపాల్టీ ఎన్టీఆర్ చౌరస్తా వద్ద పెద్ద డ్రెయినేజీని నౌవ్‌గాం బస్తీ, మార్కెట్ ఏరియా మీదుగా రైల్వే ట్రాక్ వరకు నిర్మించారు. ఈ ట్రాక్ సమీపంలోనే సంజీవయ్య కాలనీ ఉంది. ఈ కాలనీకి అనుసంధానంగా చిన్న కాల్వదానిపై కల్వర్టు ఉంది. గంటపాటు భారీ వర్షం కురిసిందంటే డ్రెయినేజీ నిండుగా ప్రవహిస్తుంది. డ్రెయినేజీని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో వరద నీరు డ్రెయినేజీలో పట్టక చుట్టపక్కల ఇళ్లలోకి వస్తోంది. వరద, మురుగు నీరు నేరుగా సంజీవయ్యకాలనీ, మార్కెట్ ఏరియలోని ఇండ్లలోకి చేరుతోంది. పదిహేను రోజుల క్రితం వర్షం సృష్టించిన బీభత్సం ఈ కాలనీవాసులు ఎప్పటికీ మరిచిపోలేదు. రాత్రి వర్షం కురిసినపుడు అంతా నిద్రలో ఉన్నారు. వర్షం మూడు గంటల పాటు ఏకధాటిగా కురిసింది. దాదాపు 30 ఇండ్లలోకి వర్షంనీరు చేరడంతో ఇంట్లో సామాన్లన్నీ తడిసిపోయాయి. కొందరి ఇళ్లలో ఏకం గా కొట్టుకుపోయాయి. వర్షం నుంచి తేరుకునే లోపే ఇదంగా సామాన్లన్నీ వరద నీటి పాలయ్యాయి. కాలనీవాసులు ఒకొరికొరు తోడుగా ధైర్యం చెప్పుకుంటూ ఉన్నారు. పక్కనున్న కాలనీవాసులు, యువకులు తాడు సహాయంతో అందరినీ సురక్షితంగా బయటకు తీసుకురావడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. ఏటా వర్షాకాలంలో తమకు ఇదే సమస్య ఉంటుందని, తమ కాలనీకి వరద నీటి ప్రభావం నుంచి శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతున్నారు.

పెద్దడ్రెయినేజీపై అక్రమకట్టడాలు వెలియటంతో నీరు వెళ్లడానికి వీలు లేక ఇళ్లలోకి వస్తోందిని కాలనీవాసులు పేర్కొంటున్నారు. వర్షాకాలం వచ్చిదంటే సంజీవయ్య కాలనీ, మార్కెట్ ఏరియాతోపాటు ఎస్పీఎం కాలనీకి చెందిన పలు క్వార్టర్లలోకి వర్షం నీరు చేరుతుంది. అధికారులు స్పందించి లోతట్టు ప్రాంతాల్లోకి వర్షంనీరు రాకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.


డ్రెయినేజీ

వర్షం వచ్చిదంటే భయమేస్తోంది..

స్వరూప, సంజీవయ్య కాలనీ



రాత్రిపూట వర్షం వచ్చిదంటే చాలు భయమేస్తోంది. వర్షం నీరు అంతా ఇండ్లలోకి వస్తోంది. ఏటా ఇదే సమస్య. అధికారులకు చెప్పినప్పటికీ ఇంతవరకు సమస్యను పరిష్కరించ లేదు. రాత్రిపూట వర్షం వస్తే జాగరణ చేయాల్సిందే. చాలా కష్టంగా కాలం వెళ్లదీస్తున్నాం. అధికారులు సమస్యను పరిష్కరించాలి.

అరగంట వర్షం కురిస్తే అంతే..

దుర్గమ్మ, సంజీవయ్యకాలనీ



వర్షాకాలం వచ్చిదంటే చాలు తమ బతుకులు దినదిన గండంగానే గడపాల్సి ఉంటుంది. అరగంట వర్షం కురిసిందంటే చాలు ఇండ్లలోకి వర్షం నీరు వస్తుంది. రాత్రి పూట వర్షం వస్తే ఇక అంతే సంగతులు. అధికారులు వస్తరు.. చూస్తరు.. పోతరు.. అంతే. ఇంతవరకు సమస్యను పరిష్కరించిన నాథుడే లేదు.

శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు..

అంజయ్య, కమిషనర్, కాగజ్‌నగర్



లోతట్టు ప్రాంతాల్లోకి వర్షం నీరు రాకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారులకు నివేదికలను పంపించాం. వాటికి అనుమతులు రాగానే చర్యలు చేపడతాం. డ్రెయినేజీ ఆక్రమణలపై కూడా దృష్టి సారిస్తున్నాం.

ఖననం చేసిన మృతదేహానికి రీపోస్టుమార్టం


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ కరుణాకర్

కాగజ్‌నగర్, ఆగస్టు 16: ఖననం చేసిన మృతదేహానికి రీపోస్టుమార్టం చేసిన సంఘటన కాగజ్‌నగర్ మండలం బురదగూడలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కాగజ్‌నగర్ మండలం బురదగూడ వాసి కొట్రంగి శ్యాంరావు (36) ఈనెల 3న మంచంపై నుంచి పడి మృతిచెందాడని తల్లి కొట్రంగి భీంబాయి పోలీసులకు ఫిర్యాదు చేయగా అదేరోజు సిర్పూరు(టి) సివిలాసుపత్రిలో పోస్టుమార్టం చేసి ఖననం చేశారు. అయితే కొంతమంది గ్రామస్థులు శ్యాంరావు మృతి అనుమానాస్పదంగా ఉందని ఎస్పీకి ఫిర్యాదుచేశారు. దీంతో శుక్రవారం మంచిర్యాల ఫోరెన్సిక్‌బృందం బురదగూడకు చేరుకుంది. కానీ రీపోస్టుమార్టం చేయవద్దని కుటుంబ సభ్యులు పోలీసులతో వాదనకు దిగారు. శ్యాంరావు మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని తామే చెబుతుండగా ఎలా చేస్తారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎవరు ఫిర్యాదు చేశారో వారిని ఇక్కడికి తీసుకరావాలని పట్టుబట్టారు. అనంతరం సీఐ అల్లం రాంబాబు, ఎస్సై మహేందర్ కుటుంబసభ్యులను సముదాయించి పోస్టుమార్టం చేయించారు. కొంట్రంగి శ్యాంరావుకు భార్య కల్పన ఉంది. గతేడాది వీరిద్దరు విడి పోయారు. శ్యాంరావు.. తల్లి భీంబాయి వద్దనే ఉంటున్నాడు. హత్యను సాధారణ మృతిగా మార్చుతున్నారన్నది గ్రామస్థుల ప్రధాన ఆరోపణ. జిల్లా అధికారులే రంగంలోకి దిగి క్షేత్రస్థాయిలో విచారణ జరిపితే తప్పా కేసు మిస్టరీ విడే అవకాశాలు కన్పించటం లేదని పలువురు పేర్కొంటున్నారు. కాగా ఎస్పీ సూచన మేరకు రీపోస్టుమార్టం చేయించామని నివేదిక రాగానే మరిన్ని వివరాలు వెల్లడిస్తామని డీఎస్పీ కరుణాకర్ తెలిపారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు: డీఆర్డీవో

బెజ్జూరు, ఆగస్టు 16: ఉపాధిహామీ పథకంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఆర్డీవో దత్తారావు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో 2023-24సంబంధించిన రూ.5కోట్ల పనులపై సామాజికతనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. బెజ్జూరు మండలంలో ఉపాధిహామీపథకంలో 298పనుల్లో 24అంశాలపై 42మందిసిబ్బందికి షోకాజునోటీసులు ఇచ్చామన్నారు. రూ.69వేలనిధుల రికవరీకి ఆదేశించామన్నారు. ఉపాధిహామీ సిబ్బందికి రూ.12 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌విజలెన్స్ అధికారి కృష్ణమూర్తి, ఎంపీడీవో గౌరీ శంకర్, ఎస్ఆర్పీ తిరుపతి, డీఆర్పీ అశోక్, ఏపీవో రజినీకాంత్, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కౌటాల, ఆగస్టు16: మండలం గుండాయిపేటలో ఇటీవల జ్వరాలతో జాడెపూజ, బోయిరే కాశీదాస్ మృతిచెందగా బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పాల్వాయిహరీష్‌బాబు పరామర్శించారు. ఈ సందర్భంగా వారి నివాసాలకు వెళ్లి చిత్రపటాలకు పూలమాలలు వేసినివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్యం నిర్వహించాలని, మెడికల్‌క్యాంపులు ఏర్పాటుచేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో రాజేందర్ గౌడ్, వానుపటేల్, యశ్వంత్, మిథున్ కవిరాజ్, విజయ్, చందు, తిరుపి, నానాజీ, మోరేశ్వర్ ఉన్నారు.

ఏజెన్సీవాసులకు వైద్యం అందించేందుకు చర్యలు: కలెక్టర్


జైనూర్:మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

జైనూర్, ఆగస్టు 16: జిల్లాలోని జైనూరు, లింగాపూర్, సిర్పూర్ ఏజెన్సీవాసులకు వైద్యం అందించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. తొలుతఓపీ గదిలోకి వెళ్లి రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలో వైద్యం సక్రమంగా చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరంల్యాబ్‌ను పరిశీలించారు. ఆసుపత్రిలో డాక్టర్లను నియమించాలని, ఇక్కడ మందుల కొరత ఉందని ఆదివాసీ సంఘాల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనకయాదవ్‌రావ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా జైనూరులో నకిలీవిలేకర్ల బెడద అధికంగా ఉందని, వారు బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నారని కలెక్టర్ దృష్టికితీసుకెళ్లారు. అనంతరం ఆసుపత్రిలో కలెక్టర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో తుకారంభట్, డాక్టర్అశోక్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, మాజీవైస్ ఎంపీపీ చిర్లేలక్ష్మణ్, ఆత్రంభీంరావ్ పాల్గొన్నారు.

శుద్ధనీటితో వ్యాధుల వ్యాప్తిని నియంత్రించవచ్చు

శుద్ధమైన నీటితో వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నియంత్రించవచ్చాని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. శుక్రవారం మండలంలోని ధనోరలో 42 ఎంఎల్‌డీ సామర్థ్యంగల పంపుహౌజ్‌ను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ శుద్ధి చేయబడిన తాగునీటని వినియోగంచడం ద్వారా అంటు, సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నియంత్రించవచ్చన్నారు. ధనోర పంపుహౌజ్‌పరిధిలో 970ఆవాసాలకు శుద్ధ జలం అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షపునీరు నిలువకుండా అంతర్గత రహదారులలో గుంతలను పూడ్చడం, దోమల వృద్ధిని అరికట్టేందుకు ఫాగింగ్, బ్లీచింగ్‌పౌడర్ పిచికారి చేయాలని తెలిపారు. నీటిని క్లోరనేషన్ చేస్తూ నిరంతరాయంగా తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనవెంట పంపుహౌజ్ డీఈ రాకేష్, ఏఈ సాయికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

బంద్ సంపూర్ణం, ప్రశాంతం

● హిందూ ఐక్యసంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు



ఆసిఫాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు



కాగజ్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్ బాబు

ఆసిఫాబాద్, ఆగస్టు 16: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందూవాహిని, జాగో హిందూ కమిటీ పిలుపుమేరకు శుక్రవారం ఆసిఫాబాద్ పట్టణంలో బంద్ సంపూర్ణంగా, ప్రశాంతంగాజరిగింది. వ్యాపార, వాణిజ్యసముదాయాలు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేసి బంద్‌కు సంపూర్ణ మద్దతునిచ్చారు. సాయిబాబా ఆలయం నుంచి హిందు సంఘాల ఐక్యవేదిక, కుల సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో భారత్‌మాతాకీజై, జైశ్రీరాం అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. పట్టణం కాషాయమైంది. ఈర్యాలీలో ఎమ్మెల్యే కోవ లక్ష్మీతోపాటు పలువురుప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అరాచకాలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న మారణకాండను అరికట్టేందుకు ఐక్యరాజ్యసమితి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా ర్యాలీలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి కొంత అస్వస్థతకు గురికావడంతో ఆందోళన నెలకొంది. ర్యాలీలో ప్రజలతో కలసినడిచిన ఆమె అంబేద్కర్‌చౌక్ వద్దకు చేరుకోగానే కళ్లు తిరిగినట్లు కావడంతో వెటనే చౌరస్తాలోని ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఉన్నగద్దెలపై కూర్చున్నారు. వెంటనే వైద్యులను పిలిపించి పరీక్షలు చేయించారు. అనంతరం కోలుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ సదయ్య, సీఐ సతీష్, ఎస్సైరాజేశ్వర్‌ఆధ్వర్యంలో పోలీసులు గట్టిబందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో జాగో హిందూకమిటీ అధ్యక్షుడు సంతోష్, ఆయాపార్టీలనాయకులు అరిగెలనాగేశ్వర్‌రావు,విశాల్, శ్యామ్‌నాయక్, మల్లికార్జున్, ఫయాజ్, కేశవరావు, జయరాజ్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్/బెజ్జూరు/చింతలమానేపల్లి/దహెగాం/సిర్పూర్(టి)/కౌటాల: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ, అక్కడి హిందువులకు మద్దతుగా కాగజ్‌నగర్, బెజ్జూరు, చింతలమానేపల్లిలో పలు హిందు సంఘాలు ఇచ్చిన బంద్ శుక్రవారం విజయవంతం అయింది. వ్యాపార, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. అత్యవసరసేవలు మాత్రమే పనిచేశాయి. కాగజ్‌నగర్‌లో భారీ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజీవ్‌గాంధీ చౌరస్తాలో ఎమ్మెల్యే హరీష్ బాబు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు వెంటనే ఆపాలన్నారు. ర్యాలీలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కొంగ సత్యనారాయణ, వీరభద్రచారి, బజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు శివగౌడ్, భాజపా పట్టణఅధ్యక్షుడు సిందం శ్రీనివాస్, రఘురాకూర్, దెబ్బటి శ్రీనివాస్, ఆయాకాలనీలకు చెందిన యువకులు పాల్గొన్నారు. సిర్పూర్(టి) ర్యాలీలో ప్రవీణ్, సాయి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.బెజ్జూరులో ఎస్సై విక్రం, చింతలమానేపల్లిలో ఎస్సై ఇస్లావత్ నరేష్, దహెగాంలో ఎస్సై రాజు, సిర్పూర్(టి)లో ఇన్‌చార్జి ఎస్సై రాములు ఆధ్వర్యంలో పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చేపట్టారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి


ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

సిర్పూర్(టి), ఆగస్టు 16: ప్రజలను నాణ్యమైన వైద్యసేవలు అందించాలని అదనపు కలెక్టర్ దీపక్‌తి వారి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని సాంఘికసంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతితో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు వైద్యసేవలు అందించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆసుపత్రిలో అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఆయనవెంట ఎంపీడీవో సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

'సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి'

లింగాపూర్, ఆగస్టు 16: సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పవార్ తుకారం అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోగల కస్తుర్బా బాలికల విద్యాలయంలో మండల సమగ్రశిక్ష ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. సంఘం బలోపేతం కోసం కలసికట్టుగా ఉండి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మండలకార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఏన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా శైలజ, ప్రధానకార్యదర్శిగా సంజీవ్ కుమార్, గౌరవ అధ్యక్షుడిగా సరస్వతిని ఎన్నుకున్నారు.



సమష్టి కృషితో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి

కాసిపేట, ఆగస్టు 16: కార్మికులు, అధికారులు సమష్టి కృషితో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని మందమర్రి జీఎం దేవేందర్ అన్నారు. మందమర్రి డివిజన్ పరిధిలోని కాసిపేట 1వ గనిలో శుక్రవారం ఆయన పర్యటించి పనిస్థలాలను పరిశీలించారు. జీఎం మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకతలను పెంచడంలో కార్మికులు రక్షణచర్యలు పాటిస్తూనే ఉత్పత్తి సాధించాలన్నారు. మొదటిసారిగా కాసిపేట గనికి వచ్చిన జీఎంను అధికారులు, కార్మికులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రూపు ఏజెంటు రాందాస్, గని మేనేజర్ భూశంకరయ్య, రక్షణాధికారి సునీల్‌కుమార్, యూనియన్ల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి అద్దె చెల్లించాలని ధర్నా

మందమర్రిటౌన్, ఆగస్టు 16: మందమర్రి ఏరియాలోని కేకే ఓసీపీలో పనిచేస్తున్న కార్మికులతోపాటు ఇతరడిపార్టుమెంట్లలో పనిచేస్తున్న కార్మికులకు 9శాతం ఇంటిఅద్దె చెల్లించాలని డిమాండ్‌చేస్తూ అఖిపలక్షం యూనియన్ నాయకులు శుక్రవారం మందమర్రిజీఎం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అంతకుముందు జాతీయరహదారినుంచి జీఎం కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటస్వామి, సాంబయ్య మాట్లాడుతూ కొన్నిసంవత్సరాలుగా ఇంటిఅద్ధె చెల్లించకపోవడంతో కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఉద్యోగులకు అద్దె చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు.

గ్యాస్ సరఫరాలో నిర్లక్ష్యం

శ్రీరాంపూర్, ఆగస్టు 16: సింగరేణి ఉద్యోగులకు భారత్ గ్యాస్ సరఫరాలో నిర్లక్ష్యం జరుగుతోందని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్‌రెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. బుకింగ్ చేసిన తరువాత పది రోజులైనా అందడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సింగరేణి ఉద్యోగులకు గ్యాస్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని వారు కోరారు.

మైనింగ్ స్టాఫ్ సదస్సును విజయవంతం చేయాలి

కాసిపేట, ఆగస్టు 16: మందమర్రిలో ఈనెల 18న నిర్వహించే బెల్లంపల్లి రీజియన్ మైనింగ్ స్టాఫ్ జనరల్ బాడీ సదస్సును విజయవంతం చేయాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచికార్యదర్శి దాగం మల్లేష్ అన్నారు. శుక్రవారం కాసిపేట గనిపై ఆయన మాట్లాడుతూ మైనింగ్‌స్టాఫ్ సిబ్బంది అపరిశ్కృత సమస్యల పరిష్కారంకోసం నిర్వహించే ఈసదస్సుకు మైనింగ్‌స్టాఫ్ కార్మికులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు మీనుగు లక్ష్మీనారాయణ, రాజేశ్వర్‌రావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సర్వే మజ్దూర్లను సర్వే అసిస్టెంట్లుగా గుర్తించాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 16: సింగరేణి సంస్థలోని సర్వే విభాగంలో పనిచేస్తున్న సర్వే మజ్దూర్లను సర్వే అసిస్టెంట్లుగా గుర్తించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య శ్రీరాంపూర్ ఓసీపీకిరాగా, ఏరియాసర్వే ఉద్యోగులు ఆయనకు వినతిపత్రం అందించారు. హెడ్‌చైన్‌మెన్‌గా నాలుగేళ్ల అనుభవం ఉంటే విద్యార్హత కలిగినవారికి అసిస్టెంట్ సర్వేయర్‌గా పదోన్నతి కల్పించాలన్నారు. యాజమాన్యంతో మాట్లాడి తమకు న్యాయం చేయాలని విన్నవించారు.

ప్రాజెక్టు అధికారికి సన్మానం

రెబ్బెన, ఆగస్టు 16: ఖైరిగూడ ఓపెన్ గనికి ప్రాజెక్టుఅధికారిగా నరేందర్ రావటంతో ఐఎన్‌టీయూసీ నాయకులు శుక్రవారం కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ప్రాజెక్టు అధికారి దృష్టికి తీసుకవచ్చారు. కార్యక్రమంలో బెల్లంపల్లి వైస్ ప్రసిడెంట్ పేరం శ్రీనివాస్, ఏరియా సెక్రటరి సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

35శాతం లాభాల వాటా ఇవ్వాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 16: సింగరేణి సంస్థ సాధించిన లాభాల నుంచి ఉద్యోగులకు 35శాతం వాటా ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య అన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నెలలు గడుస్తున్నా ఇంతవరకు లాభాల వాటా చెల్లించకపోవడం సరికాదన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తోందని ఎద్దేవా చేశారు. అనంతరం మూల సుధాకర్, తాజుద్దీన్, శివకృష్ణ, మహేష్ ఆధ్వర్యంలో 20మంది వివిధ సంఘాలకు చెందిన కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. కార్యక్రమంలో యూనియన్ ఉపప్రధానకార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆయుర్వేద వైద్య శిబిరం

శ్రీరాంపూర్, ఆగస్టు 16: నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో ఆదివారం ఉదయం 10నుంచి సాయంత్రం 6గంటలవరకు ఆయుర్వేదవైద్యశిబిరం ఏర్పాటుచేస్తున్నట్లు డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీఈఆర్ క్లబ్‌లో ఆయుర్వేద వైద్య శిబిరం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో మాతా రీసెర్చ్ సెంటర్ హైదరాబాద్ డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఉద్యోగులు, గ్రామస్థులను పరీక్షించి మందులను అందజేశారు.

అన్నాబావుసాఠె స్ఫూర్తితో అభివృద్ధికి బాటవేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జైనూర్, ఆగస్టు 16: కవిసామ్రాట్ అన్నాబావు సాఠె స్ఫూర్తితో దళితులు అభివృద్ధికి బాటవేసుకోవాలని ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. మండలకేంద్రంలోని గణేష్‌నగర్ కాలనీలో ఏర్పాటుచేసిన 104వ అన్నాబావుసాఠె జయంతి వేడుకలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అన్నాబావుసాఠె తన రచనల ద్వారా దళితసమాజాన్ని జాగృతం చేశారని అన్నారు. గణేష్‌నగర్‌లో గ్రంథాలయం మంజూరు చేస్తామని తద్వార విద్యావంతులు కావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఆయన విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వంజారీ సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ముండే వెంకటి, మాజీ ఎంపీపీ కుంర తిరుమల, మాజీ సర్పంచ్ ఆత్రం వీణబాయి, తదితరులు పాల్గొన్నారు,

రైలు ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 16: కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం తెలంగాణ ఎక్స్‌ప్రెస్ (12724) రైలు కిందపడి ప్రశాంత్ అశోక్ వ్యవహారె అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రపూర్ నుంచి కాగజ్‌నగర్ వస్తున్న ప్రశాంత్ కాగజ్‌నగర్ రైల్వే ఔటర్ సిగ్నల్ సమీపంలోకి రాగానే ప్రమాదవశాతు కిందపడ్డాడు. అదే సమయంలో రైలు అతని కాళ్లపై నుంచి వెళ్లడంతో రెండు కాళ్లు తెగిపోయాయి. స్థానికులు, జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌గౌడ్, ఆర్పీఎఫ్ పోలీసులు వెంటనే అతడిని కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు మహారాష్ట్రలోని చంద్రపూర్ పట్టణం దుర్గానగర్ నివాసి. ప్రాథమిక చికిత్స అనంతరం బాధితుడిని మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

జిల్లాలో మోస్తరు వర్షం

ఆసిఫాబాద్, ఆగస్టు 16: జిల్లాలో శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, చింతలమానేపల్లి, బెజ్జూరు, రెబ్బెన, లింగాపూర్, దహెగాం, సిర్పూర్(టి), కెరమెరి, జైనూరు మండలాల్లో ఓ మోస్తరు నుంచి తేలిక పాటి వర్షం కురిసింది.

భక్తి శ్రద్ధలతో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన

ఆసిఫాబాద్, ఆగస్టు 16: మండలంలోని కొమ్ముగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం ఉదయం ఆంజనేయస్వామి, శివపార్వతులు, గణపతి, నందీశ్వర విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, మాజీఎంపీపీ మల్లికార్జున్, బాలేష్ గౌడ్, నాయకులు మల్లన్న, వ్యాపారి నర్సింహులు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

వసతిగృహాన్ని మంజూరు చేయాలి

వాంకిడి, ఆగస్టు 16: మండలకేంద్రంలో ఎస్సీ బాలికల కళాశాల వసతిగృహాన్ని మంజూరు చేయాలని కేవీపీఎస్ జిల్లాకార్యదర్శి దినకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ బాలికల వసతిగృహం మూతపడి పది సంవత్సరాలు అయిందన్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు నిరుపయోగంగానే ఉందన్నారు. వెంటనే అధికారులు ఎస్సీ బాలికలకళాశాల వసతిగృహాన్ని మంజూరు చేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

చలో హైదరాబాద్‌కు తరలిన అతిథి అధ్యాపకులు

ఆసిఫాబాద్,ఆగస్టు 16: సమస్యలు పరిష్కరించాలని, సర్వీస్‌ను రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేస్తూ ఇంటర్మీడి యట్ బోర్డు ఎదుట నిర్వహించతలపెట్టిన ధర్నాకు జిల్లాలోని అతిథిఅధ్యాపకులు తరలి వెళ్లారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయుకలు శ్రీనివాస్, మారుతి, కృష్ణమూర్తి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

'కీజర్‌హుస్సేన్‌కు మాట్లాడే అర్హత లేదు'

సిర్పూర్(టి), ఆగస్టు 16: బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై మాజీసర్పంచ్ కీజర్‌హుస్సేన్‌కు మాట్లాడే అర్హత లేదని బీఆర్ఎస్ నాయకులు అస్లాం బీన్ అబ్దుల్లా, మాజీఎంపీటీసీ మంగీలాల్, లలిత అన్నారు. శుక్రవారం స్థానికంగా వారు మాటాడుతూ అవినీతిపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడితే ఆరోపించడం సరికాదన్నారు. అక్రమాలపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపిస్తా మన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్, ఫాహద్ అహ్మద్, షారూక్, వినోద్, సోఫి తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మందమర్రిరూరల్, ఆగస్టు 16: మండలంలోని ఆదిల్‌పేట గ్రామంలోని నీలం బ్రదర్స్ రైసుమిల్లులో టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం రాత్రి దాడి చేసి రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. శుక్రవారం ఉదయం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రైసుమిల్లును పరిశీలించి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని మిల్లును సీజ్ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పోశయ్య, అంజయ్యలు మాట్లాడుతూ అక్రమంగా నిల్వ ఉంచిన 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశామని, వీటి విలువల రూ.94,845 ఉంటుందని తెలిపారు. రైసుమిల్లు యాజమానులు నీలం వెంకటేష్, బొంద్యాలుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. స్థానిక రామకృష్ణపూర్ ఎస్‌ఐ రాజశేఖర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాజ్‌పేయి వర్ధంతి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 16: మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని మంచిర్యాల పట్టణంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ ప్రధానిగా వాజ్‌పేయి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ముల్కల మల్లారెడ్డి, రాము, మున్నారాజా సిసోడియా, మధుసూదన్‌రావు, విజయ్‌కుమార్, మల్లేష్ పాల్గొన్నారు.

మంచిర్యాల అర్బన్: మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతి పురస్కరించుకొని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. చంద్రమౌళి, వి.మధుసూదన్ రెడ్డి, వినయ్‌కుమార్, ఆనంద్, సుగుణాకర్ రెడ్డి, నాగేందర్ పాల్గొన్నారు.

కొల్లూరులో వైద్య శిబిరం

కోటపల్లి, ఆగస్టు 16: మండలంలోని కొల్లూరు గ్రామంలో శుక్రవారం వైద్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి జ్వర బాధితులకు రక్త పరీక్షలు నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్‌గౌడ్, ఎఎన్‌ఎం పుష్ప, పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అధికారులు

హాజీపూర్, ఆగస్టు 16: హాజీపూర్‌లోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద ఈ నెల 14న రాత్రి పోశమ్మ అనే వృద్ధురాలు రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని మృతి చెందింది. శుక్రవారం సంఘటన స్థలాన్ని మంచిర్యాల రూరల్ సీఐ అశోక్, ఎస్‌ఐ సురేష్, రవాణా శాఖ అధికారులు పరిశీలించారు. మృతురాలు బంధువుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు సీఐ, ఎస్‌ఐలు తెలిపారు.

ఆర్థిక సాయం

దండేపల్లి,ఆగస్టు 16: రాజుగూడ పంచాయతీ పరిధిలో జైతుగూడకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మారినేని మైసయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం మాజీ వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్ కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు అందజేశారు. మాజీ సర్పంచులు లచ్చుపటేల్, మాజీ ఉప సర్పంచులు రాజం,తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

హైద్రాబాద్‌కు బస్సు నడిపించాలి


డిపో మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

చెన్నూరు, ఆగస్టు 16: చెన్నూరు పట్టణం నుంచి ఉదయం 5 గంటలకు హైద్రాబాద్‌కు ఆర్టీసీ బస్సును నడిపించాలని శుక్రవారం మంచి ర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్‌కు కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ చెన్నూరు నుంచి హైద్రాబాద్‌కు వెళ్లడానికి విద్యార్థులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే బస్సును నడిపించాలని కోరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుర్మ రాజమల్లగౌడ్, సుధాకర్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, సుశీల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

జన్నారం, ఆగస్టు 16 : ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను, రైతులను మోసం చేస్తోందని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం జన్నారంలో విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ పడలేదని తెలిపారు. ప్రతి మహిళకు రూ. 2500 ఇస్తామని, కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. కమ్మల విజయ్‌ధర్మ, జనార్ధన్, శ్రీనివాస్‌గౌడ్, సృజన్, శ్రీనివాస్ తదితరులుపాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ర్యాలీ

మందమర్రిటౌన్, ఆగస్టు 16: కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా శుక్రవారం రాత్రి జనసేన పార్టీ నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ సెంటర్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. నిందితున్ని వెంటనే ఉరి తీయాలని డిమాండ్ చేశారు. మాయ రమేష్, పిట్టల సుధాకర్ పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం


హాజీపూర్‌లో కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే


మంచిర్యాలలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఏసీసీ, ఆగస్టు 16: పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో 338 మంది లబ్ధిదారులకు 1 కోటి 5 లక్షల రూపాయల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో పేదలకు వైద్య ఖర్చుల కోసం డబ్బులను అందించడానికి సీఎం రిలీఫ్ ఫండ్, రైతులకు రైతుబంధు, బీమా, రుణమాఫీ, పేదింటి ఆడపడుచుల వివాహానికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్‌లు తదితర అనేక సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. వాటితో పాటు ఆరు గ్యారంటీలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ తదితర పథకాలు ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా అమలు చేస్తున్నామన్నారు. పట్టణాధ్యక్షుడు తూముల నరేష్, బ్లాక్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, హేమలత, రజిత, నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

హాజీపూర్: తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు 90 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మండలంలో మహిళల కోసం రైసు మిల్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దసరాలోపు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, నూతన పింఛన్‌లు అందజేస్తామన్నారు. రుణమాఫీ కానీ రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, డిప్యూటి తహసీల్దార్ హరిత, ప్రభాకర్, సత్తయ్య, శ్రీనివాస్‌గౌడ్, బాపు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసి తీరుతామని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు మ్యాదరిపేట భారతీ తీర్థ గార్డెన్‌లో 240 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను ప్రవేశపెట్టి అర్హులకు అందిస్తున్నామన్నారు. మండలానికి ఒక ఎత్తిపోతల పథకంతోపాటు ఆశ్రమ పాఠశాలను రెబ్బనపల్లిలో నిర్మించేందేందుకు కృషి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలో 3 రైస్ మిల్లు ఏర్పాటు చేసి ఐకేపీ మహిళ సంఘాలకు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తామన్నారు. గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి, లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్‌చందు, మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ గడ్డం నాగరాణిత్రిమూర్తి, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ప్రవీణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపిడివో ప్రసాద్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేయాలని హల్‌చల్

● తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం
● అడ్డుకొన్న పోలీసులు


పురుగుల మందు డబ్బాతో చింత విష్ణు

నెన్నెల, ఆగస్టు 16: భూమి రిజిస్ట్రేషన్ చేయాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అన్నదమ్ములు హల్‌చల్ చేశారు. వారం రోజులుగా తిప్పుకోవడంతో విసుగు చెందిన వారు తహసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగుల మందు తాగేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. గొళ్లపల్లి గ్రామానికి చెందిన చింత విగ్నేష్, విష్ణులు సర్వే నంబరు 332లో 7 ఎకరాల భూమిని దమ్మ సునీత వద్ద కొనుగోలు చేశారు. భూమి రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 7న స్లాట్ బుక్ చేసుకున్నారు. తహసీల్దార్ రేపు మాపంటూ వారం రోజులు తిప్పుకున్నాడని శుక్రవారం రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో తహసీల్దార్‌ను నిలదీశారు. కుటుంబ సభ్యులతో కలిసి బైఠాయించారు. స్లాట్ బుక్ అయిన తరువాత రిజిస్ట్రేషన్ ఎలా నిలిపి వేస్తారని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న ఎస్సై ప్రసాద్ కార్యాలయానికి చేరుకున్నారు. విగ్నేష్ వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించగా పోలీసులు లాక్కొని తహసీల్దార్ వద్దకు తీసుకెళ్లారు. తహసీల్దార్ చాంబర్‌లో మాట్లాడుతుండగా విష్ణు పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు సర్ది చెప్పి తిప్పి పంపారు. తహసీల్దార్ రమేష్‌ను వివరణ కోరగా రాజేశ్వర్‌రావు అనే వ్యక్తి రిజిస్ట్రేషన్‌కు అభ్యంతరం చెబుతూ ఫిర్యాదు చేయడంతో క్షేత్రస్థాయిలో విచారణ జరిపి రిజిస్ట్రేషన్ చేస్తామని వారికి చెప్పామన్నారు. విచారణ చేసిన వెంటనే రిజిస్ట్రేషన్ చేస్తామని పేర్కొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 16: కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, స్కీం వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి బ్రహ్మానందం, తాళ్లపల్లి శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 30 వరకు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై డిపార్టుమెంట్ల వారీగా ప్రచారం నిర్వహిస్తామన్నారు. బొగ్గు గనుల వేలం పాటలను రద్దు చేసి సింగరేణికే గనులను అప్పగించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. గనుల వేలం పాటలను వ్యతిరేకిస్తూ ఈ నెల 21న కొత్తగూడెంలోని సింగరేణి కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపడుతామని, పెద్ద సంఖ్యలో కార్మికులు, నాయకులు తరలి రావాలని కోరారు. అలాగే ప్రీమెట్రిక్ హాస్టల్‌లో పనిచేసే వర్కర్లకు ప్రతీ నెల వేతనాలు చెల్లించాలని ఈ నెల 27న హైద్రాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్నామన్నారు.

జిల్లాలో కురిసిన మోస్తరు వర్షం

ఏసీసీ, ఆగస్టు 16 : మంచిర్యాల జిల్లాలో పలు చోట్ల మోస్తారు నుంచి భారీ వర్షం కురుస్తోంది. కోటపల్లి మండలంలో 45.5 మిల్లీమీటర్లు, దండేపల్లి 40.0, తాండూరు 31.5, భీమిని 27.0, భీమారం 22.8, జైపూర్ 21.8, వేమనపల్లి 21.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా కేంద్రంలో చిరు జల్లులతో కూడిన మోస్తారు వర్షం కురుస్తుంది.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మందమర్రిటౌన్, ఆగస్టు 16: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏఎస్‌ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రాష్ట్రీయరహదారి జయశంకర్ చౌరస్తా వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకోవద్దన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలను సేవించి డ్రైవింగ్ చేయడం నేరమన్నారు. కార్యక్రమంలో పోలీసులు లక్ష్మయ్య, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలించిన ల్యాండ్ సర్వేయర్ అధికారి

వేమనపల్లి, ఆగస్టు 16: దస్నాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలకు చెందిన స్థలం కబ్జాకు గురైందని గ్రామస్థుల ఫిర్యాదు మేరకు శుక్రవారం పాఠశాల స్థలాన్ని జిల్లా ల్యాండ్ సర్వేయర్ అధికారి శ్రీనివాస్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దస్నాపూర్ చెందిన ఓ నాయకుడు స్థలం కబ్జా చేయడంతో విద్యార్థులు ఆడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదు చేశారని తెలిపారు. త్వరలోనే స్థలం హద్దులు గుర్తించి భూమిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ రమేష్, గ్రామస్థులు ఉన్నారు.

ఉద్యోగం సాధించిన పూర్వ విద్యార్థినికి సన్మానం

జన్నారం, ఆగస్టు 16: జన్నారంలోని జయరాణి పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థిని చుంచు ప్రవళిక పంచాయతీరాజ్ ఏఈఈ ఉద్యోగం సాధించింది. శుక్రవారం పాఠశాలలో ప్రవళికను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు సన్మానించారు. కరస్పాండెంట్ మధుసూదన్ పాల్గొన్నారు.

ఇటీవల పదవీ విరమణ చేసిన మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ మాదాడి సరోజనరవీందర్‌రావు, వైస్ ఎంపీపీ సుతారి వినయ్‌కుమార్, కోఆప్షన్‌సభ్యులు మున్వర్ అలీఖాన్‌లను శుక్రవారం ఎస్టీటీ చైర్మన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత సన్మానించారు.

పిడుగు పాటుతో ముగ్గురు మృతి


రమేష్ మృతదేహం


అంజన్న (ఫైల్)

ఆసిఫాబాద్/కెరమెరి, ఆగస్టు 16: జిలాల్లో శుక్రవారం పిడుగుపాటుతో ఆసిఫాబాద్ మండలం నందుపా గ్రామానికి చెందిన దౌత్రేఅంజన్న(20), కెరమెరి మండలకేంద్రానికి చెందిన చౌదరి రమేష్ (30) శుక్రవారం సాయంత్రం పిడుగు పాటుతో మృతిచెందారు. ఆసిఫాబాద్ మండలం నందుపా గ్రామానికి అంజన్న రోజులాగానే తమవ్యవసాయ భూమిలో పనుల కోసం వెళ్లాడు. పనులుముగించుకుని వస్తుండగా మార్గమధ్యలో వర్షం కురిసింది. ఈక్రమంలో ఒక్కసారిగా పిడుగుపడడంతో అంజన్న అపస్మారకస్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు అంజన్నను వెంటనే కాగజ్‌నగర్‌లోని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారిం చారు. మరో సంఘటనలో కెరమెరి మండలకేంద్రానికి చెందిన చౌదరి రమేష్(30) మండలంలోని చింతకర్ర సమీపంలోని షేక్‌హుస్సేన్ పంటచేనులో వ్యవసాయ పనులు చేస్తుండగా పిడుగుపడింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బెల్లంపల్లి(తాండూర్): పిడుగుపడి రైతు కూలీ మృతిచెందినట్లు తాండూర్ ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. కుమరంభీం జిల్లా రెబ్బెన మండలం కొమురవెల్లి గ్రామానికి చెందిన ఇట్యాల హన్మంతు(30) అనే రైతుకూలీ అచ్చలాపూర్‌లో మూడు సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాడు. గురువారం అచ్చలాపూర్‌లోని రాజిరెడ్డి కౌలుకు తీసుకున్న చేనులో కూలీ పనులు చేస్తుండగా పిడుగు పడి అక్కడికకక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా వరలక్ష్మి వ్రతం


ఆసిఫాబాద్‌లో పూజల్లో పాల్గొన్న మహిళలు

ఆసిఫాబాద్, ఆగస్టు 16: ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలో శుక్రవారం శ్రావణమాసం పురస్కరించుకుని మహిళలు వరలక్ష్మి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఆలయాలకు తరలివెళ్లి వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. జిల్లాకేంద్రంలోని సరస్వతీశిశు మందిర్‌లో నిర్వహించిన వరలక్ష్మి వ్రతాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి వేణుగోపాల్, సభ్యులు సంతోష్, కాండ్రె దుర్గ, వైష్ణవి, ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో శుక్రవారం సాముహిక వరలక్ష్మి వ్రతపూజలు చేశారు. కార్యక్రమంలో పోషకులు, మహిళలు పాల్గొన్నారు.

మహిళలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలి


ఆసిఫాబాద్‌లో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆసిఫాబాద్, ఆగస్టు 16: తెలంగాణలోని మహిళలపట్ల కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికాదని మహిళాలోకానికి ఆయన భేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ అన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలు నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాకేంద్రంలో కేటీఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచితబస్సు ప్రయాణం జీర్ణించుకోలేని బీఆర్ ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు లోకేష్, నిజాం, మారుతి, శంకర్, జక్కన్న, బాలేష్, సత్తయ్య, మల్లికార్జున్, వెంకటేష్, మిలింద్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం


కెరమెరిలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కెరమెరి/రెబ్బెన: మహిళలను బ్రేక్‌డ్యాన్స్ చేయండి అని అనుచితవ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మను కెరమెరి,రెబ్బెన మండల కేంద్రాల్లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు దహనంచేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి మహిళల కోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే మాజీ మంత్రి కేటీఆర్ మహిళలపై అనుచిత వాఖ్యాలు చేయటం సిగ్గుచేటన్నారు. వెంటనే కేసీఆర్ మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కెరమెరిలో కాంగ్రెస్ నాయకుడు, మార్కెట్‌కమిటీ మాజీ అధ్యక్షుడు మునీర్ అహ్మద్ శ్రీనివాస్, వెంకటస్వామి, వాగు పటేల్, నగేష్, రెబ్బెనలో నాయకులు రమేష్, దేవాజీ, వేముర్ల సంతోష్, మోడెం సుదర్శన్ గౌడ్, చెన్న సోమశేఖర్, రాజేంద్ర కుమారి పాల్గొన్నారు.

బీసీ యువతకు ఉచిత శిక్షణ

ఆసిఫాబాద్, ఆగస్టు 16: హైదరాబాద్ టీజీబీసీ ఎంప్లాయిబిలిటీ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్‌సెంటర్ ఆధ్వర్యంలో వందమంది వెనకబడిన తరగతుల నిరుద్యోగ అభ్యర్థులకు వివిధకోర్సుల్లో ఉచితశిక్షణ అందిస్తామని జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖాధికారి సజీవన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌జీ హోప్ టెక్నికల్ స్కిల్‌అకాడమీ, ఎన్‌ఎస్‌ఐసీ, హైదరాబాద్ వారిసౌజన్యంతో శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణలో ప్రతినెలఅభ్యర్థికి రూ.4వేల రూపాయలతో పాటు భోజనం, స్టడీమెటీరియల్, బేసిక్ టూల్ కిట్‌బ్యాగ్, టీషర్టు అందిస్తామన్నారు. కోర్సు పూర్తిచేసిన వారికి ధ్రువపత్రంతోపాటు ప్లేస్‌మెంట్ ఇస్తామని తెలపారు. ఈనెల24 లోగా ఆన్‌లైన్‌లోదరఖాస్తు సమర్పించాలన్నారు.

అద్దెకు రాఖీ స్టాల్స్

ఆసిఫాబాద్, ఆగస్టు 16: రాఖీపౌర్ణమిని పురస్కరించుకుని ఆసిఫాబాద్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో అద్దెకు రాఖీస్టాల్స్ ఏర్పాటు చేస్తామని ఆర్టీసీ డీఎం విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాఖీ స్టాల్స్ ఏర్పాటు చేసుకునే వారు ఆర్టీసీ డిపో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్, ఆగస్టు 16: విద్యాసంవత్సరం (2024-25)కు గాను షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులకు విదేశీ విద్యాలయాల్లో ఉన్నతవిద్యను అభ్యసించేందుకు తెలంగాణ ప్రభుత్వం అంబేద్కర్ ఓవర్‌సిస్ విద్యానిధి పథకం నుంచి ఉపకార వేతనాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈనెల 18నుంచి అక్టోబర్ 13వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖాధికారి సజీవన్ ఒక ప్రకటనలో తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


ఆసిఫాబాద్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్‌నాయకులు

ఆసిఫాబాద్, ఆగస్టు 16: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేసిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ ఆధ్వర్యంలో నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు లోకేష్, నిజాం, జక్కన్న, సత్యనారాయణ, శంకర్, మారుతి, పటేల్, బాలేష్, ఆరీఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు మతలబేమిటో..?



- డిసెంబరులోనే ముగిసిన 'గుర్తింపు' ఎన్నికలు
- ఇప్పటికీ గుర్తింపు పత్రం అందజేయని వైనం
- యాజమాన్యంపై ఒత్తిడి చేయని ఏఐటీయూసీ
- కాలపరిమితి పెంచుకొనేందుకేననే విమర్శలు
- గుర్తింపు రద్దుకు హెచ్‌ఎంఎస్ డిమాండ్

సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఎనిమిది నెలలు గడుస్తున్నా గెలుపొందిన ఏఐటీయూసీకి ప్రాతినిధ్య హక్కులు కల్పించలేదు. ఎన్నికల్లో గెలుపొందినప్పటికీ గుర్తింపు హోదా కోసం పట్టుబట్టకపోవడంపై మిగితా జాతీయ సంఘాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. సింగరేణిలో రెండేళ్లకో సారి గుర్తింపు ఎన్నికలు నిర్వహిస్తుంటారు. గత ఎన్నికలో టీబీజీకేఎస్ గెలుపొంది రెండేళ్ల కాలపరిమితితో ధ్రువీకరణ పత్రం పొందింది. అయితే ఆలస్యంగా తాము ధ్రువీకరణ పత్రం అందుకున్నామని, నాలుగేళ్ళ కాలపరిమితి ఇవ్వాలని పట్టు బడింది. ఈ క్రమంలో కేంద్ర కార్మికశాఖ రెండేళ్ల కాల పరిమితితో ధ్రువీకరణ పత్రం అందజేసేందుకు సిద్ధం కాగా ఏఐటీయూసీ నాలుగేళ్ల కు పట్టుబడుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మంచిర్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు ముగిసి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటికీ గెలుపొందిన ఏఐటీయూసీకి ప్రాతినిధ్య హక్కులు కల్పించడం లేదు. గతంలో గుర్తింపు సంఘంగా ఉన్న బీఆర్ఎస్ అనుబంధ తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) కాల పరిమితి ముగియడంతో గతేడాది డిసెం బరు 27న యాజమాన్యం గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించింది. ఆ ఎన్నికల్లో ఏఐటీయూసీ ట్రేడ్ యూనియన్‌గా విజయం సాధించింది. అయితే ఇప్పటి వరకు ఏఐటీయూసీకి ప్రాతినిధ్య హోదా కల్పించలేదు.

టీబీజీకేఎస్ పదవీకాలం ముగియడంతో..

సింగరేణి గుర్తింపు సంఘంగా ఎన్నికైన ఏఐటీయూసీ ధ్రువీకరణ పత్రం అందుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల్లో గెలుపొందినప్పటికీ గుర్తింపు హోదా కోసం పట్టు బట్టకపోవడంపై ఇతర జాతీయ సంఘాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. సింగరేణిలో రెండేళ్లకోసారి గుర్తింపు ఎన్నికలు నిర్వహిస్తుంటారు. గతంలో ట్రేడ్ యూనియన్‌గా గుర్తింపు పొందిన టీబీజీకేఎస్ కాలపరిమి తి 2019 అక్టోబర్ 5తో ముగిసింది. 2017 అక్టోబర్ 5న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో టీబీజీకేఎస్ గెలుపొందింది. కేంద్ర కార్మికశాఖ టీబీజీకేఎస్‌కు రెండేళ్ల కాల పరిమితితో ధ్రువీకరణ పత్రం అందజేసింది. కేంద్ర కార్మిక శాఖ ఇచ్చిన అధికార పత్రంలో రెండేళ్లుగా పేర్కొనడంతో ఎన్నికలు పూర్తయిన తరువాత ఆలస్యంగా తాము ధ్రువీకరణ పత్రం అందుకున్నా మని, 2020 ఏప్రిల్ వరకు కాలపరిమితి ఉందంటూ టీబీజీకేఎస్ నాయకులు చెబుతూ వచ్చారు. అలా ఎన్నికల నిర్వహణలో జాప్యం జరుగగా, ఈ లోపు కరోనాతో మరింత ఆలస్యమైంది. చివరిగా 2023 డిసెంబర్ 27న ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది.

హోదా కల్పించకపోవడంతో

సింగరేణి గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ గెలుపొందినప్పటికీ నాలుగు నెలలు గడుస్తున్నా కేంద్ర కార్మికశాఖ ధ్రువీకరణ పత్రం అందజేయలేదు. దీంతో ఏఐటీయూసీకి కార్మికుల పక్షాన ప్రాతినిధ్యం వహించే అధికారం లేకుండా పోయింది. కేంద్ర కార్మికశాఖ రెండేళ్ల కాలపరిమితితో ధ్రువీకరణ పత్రం అందజేసేందుకు సిద్ధం కాగా ఏఐటీయూసీ నాలుగేళ్లకు పట్టుబడుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గతంలో టీబీజీకేఎస్ గెలుపొందిన ఆరు నెలల తర్వాత తాము ధ్రువీకరణ పత్రం అందుకున్నామని, 2020 ఏప్రిల్ వరకు కాలపరిమితి ఉందంటూ టీబీజీకేఎస్ భీష్మించుకు కూర్చుంది. ప్రస్తుతం అదే దారిలో ఏఐటీయూసీ కూడా నడుస్తుందనేది హెచ్‌ఎంఎస్ వాదన. గుర్తింపు ఎన్ని కల్లో ఏఐటీయూసీ గెలుపొంది ఇప్పటికే ఎనిమిది నెలలు పూర్తి కాగా, మరి కొంత కాలం సాగదీస్తే నాలుగేళ్లు పదవిని అలంకరించవచ్చనే అభిప్రాయంతో ఏఐటీయూసీ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై హెచ్‌ఎంఎస్ రెండేళ్ల కాలపరిమితికే అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నాలుగు నెలల క్రితం కేంద్ర కార్మికశాఖకు లేఖ రాయగా, తాజాగా ఏఐటీయూసీ గుర్తింపు రద్దు చేయాలని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఇటీవల మరో లేఖ రాశారు.

గుర్తింపు రద్దు చేయాలి....

హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్

సాధారణ ఎన్నికల్లో గెలుపొందిన వారు గరిష్ఠంగా ఆరు నెలల కాలంలోగా పదవీ బాధ్యతలు స్వీకరిస్తూ ప్రమాణ స్వీకారం చేయాలనే నిబంధన ఉంది. అదే నిబంధన సింగరేణి ఎన్నికల్లోనూ అమలు చేయవలసిన అవసరం ఉంది. ఏఐటీయూసీ ట్రేడ్ యూనియన్‌గా గెలు పొంది ఎనిమిది నెలలు గడుస్తున్నందున నిబంధనల మేరకు ఆ హోదాను రద్దు చేయాలి. అలాగే సంస్థపరమైన సమావేశాలు, ఇతర కార్యక్రమాల్లో ఏఐటీయూసీతోపాటు అన్ని జాతీయ సంఘాలు పాల్గొనేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో యూని యన్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపట్టవలసి వస్తుంది.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్
- వైద్య సేవలపై ఆరా

బెల్లంపల్లి, ఆగస్టు 16: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బెల్లంపల్లిలోని వంద పడకల ఏరియా ఆసుపత్రిని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు సరిగ్గా వైద్యం అందిస్తున్నారా? ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు, మందులు ఇస్తున్నారా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యం అందిస్తున్నారని, మందులు ఇస్తున్నారని కలెక్టర్‌కు సమాధానం చెప్పారు. అనంతరం ఫార్మసీ, ఆసుపత్రి ఆవరణను, రిజిష్టర్‌లను పరిశీలించారు. వైద్యులతో కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలని, రోగుల పట్ల స్నేహ పూర్వకంగా ఉండాలని, నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు.

-తాండూర్‌లో..

తాండూర్ మండలంలోని మహాత్మాగాంధీ జ్యోతి బాపూలే, కస్తూర్బా పాఠశాలలను కలెక్టర్ కుమార్ దీపక్ సందర్శించారు. పాఠశాలల్లోని వంట గదులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన వేడి ఆహారం అందించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసి రోగులతో మాట్లాడారు. జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు మూసి ఉండడంతో ఎంఈవోను అడిగి తెలుసుకున్నారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఉపాధ్యాయులు సెలవు తీసుకోవడంతో పాఠశాలను మూసి వేశామని తెలిపారు. కలెక్టర్ డీఈవోతో మాట్లాడుతూ పాఠశాల మూసి ఉందని, ఉపాధ్యాయుల వేతనం కట్ చేయాలని సూచించారు. ఆప్షనల్ హాలిడే కారణంగా ఉపాధ్యాయులు సెలవు తీసుకున్నారని కలెక్టర్ డీఈవోకు తెలిపారు. అనంతరం అచ్చలాపూర్‌లో పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు రాకుండా పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



బెల్లంపల్లిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

జ్వరపీడిత గ్రామాలను గుర్తించాలి



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

కాసిపేట, ఆగస్టు 16: మండలంలో జ్వర పీడిత గ్రామాలను గుర్తించి వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ అన్నారు. శుక్రవారం కాసిపేట ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రైడే కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. మందుల కొరత లేకుండా చూడాలని, మెడికల్ ఆఫీసర్, వైద్య సిబ్బంది అవుట్ పేషెంట్ల సమయం పెంచి వైద్యం అందించాలన్నారు. సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రికి ముగ్గురు స్టాఫ్ నర్సులను కేటాయించగా ఇద్దరు శుక్రవారం జాయిన్ కావడంతో వివరాలు తెలుసుకున్నారు. డీఎంహెచ్‌వోను ఆసుపత్రి సిబ్బంది ఘనంగా సన్మా నించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్, మెడికల్ ఆఫీసర్ రవికిరణ్, డీఈ ఎంవో బుక్య వెంకటేశ్వర్, ల్యాబ్ టెక్నీషియన్ గోపి, ఫార్మాసిస్టు అబ్దుల్ బారీ పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



దండేపల్లి కస్తూర్బాలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

దండేపల్లి, ఆగస్టు 16: వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కస్తూర్బా విద్యాలయ సిబ్బందిని జిల్లా విద్యాధికారి యాదయ్య ఆదేశించారు. దండేపల్లిలో శుక్రవారం విద్యాలయాన్ని డీఈవో సందర్శించారు. పరిసరాల పరిశుభ్రత, విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన అమలు తీరును ఆయన పరిశీలించారు. డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు చక్కటి విద్యాబోధన అందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతి విద్యార్థిని క్రమశిక్షణతో చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలన్నారు. వ్యాధులు ప్రబలకుండ విద్యార్థులు పరిశుభ్రంగా ఉండాలన్నారు. వంట గదులు, టాయిలెట్స్, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. సమయం వృథా చేయకుండా మంచిగా చదువుకుని మంచి గ్రేడ్ సాధించాలని విద్యార్థులను ఆకాంక్షించారు. కస్తూర్బా విద్యాలయ ప్రత్యేక అధికారి మంజుల, ఉపాధ్యాయురాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 16: ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా కొత్త వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర మహాసభ కార్యదర్శి, ఎన్నికల అధికారి గంప శ్రీనివాస్, పరిశీలకులు ఐత రత్నాకర్‌లు తెలిపారు. శుక్రవారం ఆర్యవైశ్య భవనంలో ఎన్నికలు నిర్వహించగా లక్షెటిపేట నుంచి కొత్త వెంకటేశ్వర్లు ఒక్కరే నామినేషన్ వేయగా ఎన్నిక ఏకగ్రీవమైందని వారు తెలిపారు. ధ్రువీకరణ పత్రాన్ని ఈ నెల 25న మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది చేతుల మీదుగా అందజేస్తారన్నారు. రాష్ట్ర మహాసభ ఉపాధ్యక్షుడు నల్మాసు కాంతయ్య, కార్యదర్శి ముక్తా శ్రీనివాస్, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు కొత్త రాజేశం, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చిలువేరు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాజీపూర్, ఆగస్టు 16: మండలంలోని 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాజీపూర్, టీకనపల్లి, కొండపల్లి, దొనబండ, పెద్దంపేట్, బుద్ధిపల్లి, కొండాపూర్, కర్ణమామిడి, పడ్తన్‌పల్లి, రాంపూర్, ధర్మారం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఉద్యోగులకు పదోన్నతి

లక్షెట్టిపేటరూరల్, ఆగస్టు 16: లక్షెట్టిపేట విద్యుత్ శాఖలో పనిచేసే ఏడుగురు ఉద్యోగులకు పదోన్నతి కల్పిస్తున్నట్లు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కార్యాలయంలో పనిచేసూ జూనియర్ లైన్‌మెన్‌లు పెంచాల సందీప్, బుస్స నాగరాజు, పవన్, రాజు, నారాయణ, రాజశేఖర్, రంజిత్‌కుమార్‌లు అసిస్టెంట్ లైన్‌మెన్‌లుగా పదోన్నతి పొందారు. వీరిని ఏడీఈ ప్రభాకర్, ఏఈ గణేష్, లైన్‌మెన్‌లు అభినందించారు.

బంద్ విజయవంతం

చెన్నూరు, ఆగస్టు 16: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ శుక్రవారం చెన్నూరు పట్టణంలో హిందూ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. దుకాణదారులు, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. హిందు ఐక్య వేదిక నాయకులు ర్యాలీ నిర్వహించారు.

నెన్నెల: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందుత్వ సంఘాల పిలుపు మేరకు శుక్రవారం చేపట్టిన బంద్ విజయవంతమైంది. మండల కేంద్రంలోని వ్యాపార, విద్య సంస్థలు స్వచ్ఛందంగా బందులో పాల్గొన్నాయి. ఆటోలు నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు శైలెందర్‌సింగ్, మిట్ట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ నమోస్తుతే...

- వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు
- కిటకిటలాడిన ఆలయాలు



గూడెంలో వరలక్ష్మీదేవి ముస్తాబు, దండేపల్లి రామాలయంలో పూజల్లో పాల్గొన్న మహిళలు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 16: జిల్లా కేంద్రంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వనాథ ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో కలెక్టర్ కుమార్ దీపక్ సతీ సమేతంగా హాజరయ్యారు. ఆలయ ఈవో ఎం.రవీందర్, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. కలెక్టర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనాన్ని అందించారు. అర్చకులు బాలయ్య, గోవర్దన్, భట్టా చార్య, నరహరి శర్మ, బాలకృష్ణ పాల్గొన్నారు. మహిళలు ఇండ్లలో అమ్మ వారి చిత్రపటాలను అలంకరించి నేవేద్యాలను, పిండివంటకాలను తయారుచేసి అమ్మవారికి సమర్పించి పూజలు నిర్వహించారు.

దండేపల్లి: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని వరలక్ష్మి వ్రతాలు జోరుగా సాగాయి. ఆలయాలు, ఇండ్లలో మహిళలు వరలక్ష్మి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. అలాగే శ్రావణమాసం, వరలక్ష్మి శుక్రవారం పురస్కరించుకుని గూడెం సత్యనారాయణ స్వామి దేవాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచే భక్తులు కుటుంబసమేతంగా తరలివచ్చి గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం సత్యదేవున్ని దర్శించుకొని పూజలు చేశారు. భక్తులు స్వామి వ్రతాలను ఆచరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసినట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ పేర్కొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు. వ్రతంలో 64 మంది మహిళలు పాల్గొన్నారు. మహిళలు కుంకుమ పూజలు, లక్ష్మీపూజలు నిర్వహించారు.

మంచిర్యాల కలెక్టరేట్: జిల్లా కేంద్రంలో మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా జరుపుకున్నారు. రెడ్డి కాలనీ, రాంనగర్ కాలనీల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలకు వాయినాలు ఇచ్చిపుచ్చు కున్నారు. నాగమణి, మౌనిక, భార్గవి, రాణి, సాత్విక, పాల్గొన్నారు.

భీమారం: మండలంలో వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఒకరికి ఒకరు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. కోదండ రామాలయంలో ఆలయ అర్చకులు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మందమర్రిరూరల్: మండలంలో మహిళలు వర లక్ష్మీవ్రతాన్ని ఘనంగా జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి వరలక్ష్మీకి పూజలు చేశారు. చుట్టు పక్కల మహిళలకు వాయినాలు సమర్పించారు.

మందమర్రిటౌన్: పట్టణంలో శ్రావణ శుక్రవారంను పురస్కరించుకుని ఇండ్లలో, ఆలయాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతం చేశారు సీఎస్పీ వద్ద గల కనక దుర్గ ఆలయంలో మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలు చేశారు. అర్చకులు నర్సింగ్ భవానీ వరలక్ష్మీ వ్రతం విశిష్టతను వివరించారు.



మంచిర్యాల విశ్వనాథ ఆలయంలో పాల్గొన్న కలెక్టర్ దంపతులు

హత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 16: కలకత్తాలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థినిపై హత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని వైద్యులు సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని, ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. సీనియర్ రెసిడెంట్ వైద్యులు, హౌస్ సర్జన్లు, వైద్య విద్యార్థులు, నర్సులు పాల్గొన్నారు.

నేడు ఐఎంఏ బంద్

కల్‌కత్తాలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థిని హత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం బంద్ పాటిస్తున్నట్లు అధ్యక్షుడు డాక్టర్ పి.రమణ, ప్రధాన కార్యదర్శి కెవిఎల్ఎన్.మూర్తి, కోశాధికారి కెఎంఎన్.శ్రీనివాస్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి 24 గంటల బంద్ పాటించాలని పేర్కొన్నారు. అందరు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

బెల్లంపల్లి, ఆగస్టు 16: నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో పంచాయతీరాజ్, ఐటీడీఏ, ఆర్అండ్‌బీ నిధులతో చేపడుతున్న నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అధికారులకు సూచించారు. బెల్లంపల్లిలో శుక్రవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కల్వర్టులు, రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు త్వరగా పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడెక్కడ రహదారులు, కల్వర్టులు, బ్రిడ్జిలు అవసరమో సంబంధిత నివేదికలను త్వరగా అందజేయాలని సూచించారు.

భైరవస్వామి సేవలో బెల్లంపల్లి ఎమ్మెల్యే

కోటపల్లి, ఆగస్టు 16: మండలంలోని పారుపెల్లిలోని భైరవస్వామిని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ శుక్రవారం దర్శించుకున్నారు. నియోజకవర్గంలోని ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నట్లు తెలిపారు. వేమనపల్లి మండల మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్, కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీ, నీల్వాయి మాజీసర్పంచు మధు పాల్గొన్నారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏసీసీ, ఆగస్టు 16: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు మాట్లాడుతూ మహిళలను అవమానించేలా కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. తక్షణమే కేటీఆర్ మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మహిళలకు సమ్మక్క, సారలమ్మ, చాకలి ఐలమ్మ, రుద్రమదేవి అంటూ కీర్తించిన కేటీఆర్ ఇప్పుడు మహిళల పట్ల చులకన భావం చూపడం శోచనీయమన్నారు. మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత, పట్టణాధ్యక్షురాలు అర్కల హేమలత, తూముల నరేష్, పూదరి తిరుపతి, మహిళలు పాల్గొన్నారు.

చెరువును పరిరక్షించాలి



చెరువు మత్తడిని పరిశీలిస్తున్న పౌర సేవా సంస్థ సభ్యులు

ఏసీసీ, ఆగస్టు 16: రాముని చెరువును పరిరిక్షించాలని పౌర సేవా సంస్థ నాయకులు అన్నారు. శుక్రవారం చెరువు మత్తడిని పరిశీలించారు. వారు మాట్లాడుతూ రెండేండ్ల క్రితం కావాలని రాముని చెరువు మత్తడిని అప్పటి మున్సిపల్ కమిషనర్ కూలగొట్టించి చెరువులో మట్టిని అమ్ముకున్నాడని ఆరోపించారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.2 లక్షలు కేటాయించి మత్తడి నిర్మాణం చేపట్టారన్నారు. అయినా నిర్మాణం నాణ్యతగా లేదని, మత్తడి లీకవుతుందని, మరమ్మతు చేసిన అనంతరమే కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించాలన్నారు. కనుకుంట్ల మల్లయ్య, తుల మధుసూదన్‌రావు, నల్ల నాగేందర్, శ్రీనివాస్, కైలాసం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.